క్లుప్తంగా

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



నందిగామటౌన్: పట్టణంలోని ముక్కోటి మహామండపంలో ధనుర్మాసం సందర్భంగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నకేశవస్వామికి పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన శ్రీమద్రామాయణ పురాణ ప్రవచనం, పరమార్థం ఆధ్యాత్మిక ప్రవచనం, భక్తి సంగీత విభావరి, హరికథాగానం. తదితర కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




కంచికచర్ల: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టోల్‌ప్లాజా మేనేజర్ జయప్రకాష్ కోరారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వాహనదారులకు ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కారు నడిపే డ్రైవర్లు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనదారులు అతివేగంగా వాహనాలను నడపరాదన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతున్నందునే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ప్లాజా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లు ప్రారంభం



వత్సవాయి : పశుపోషకుల అభ్యున్నతిలో భాగంగా పశుపోషకులు మినీ గోకులం షెడ్డు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. మండలంలోని మంగొల్లు, గోపినేనిపాలెం, మక్కపేట, వత్సవాయి గ్రామాల్లో ఏర్పాటుచేసిన మినీగోకులం షెడ్లు, సీసీరోడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పాడిరైతులతోపాటు కోళ్ల పెంపకందారుల గోకులం షెడ్లు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, సర్పంచ్‌లు బాణావతు శ్రీనివాసరావు, మల్లెల శివ, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లెల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రేగి పండ్లకు భలే డిమాండ్



నందిగామటౌన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగలో భోగి పండుగ ప్రధానమైనది. భోగి పండుగ సూర్య భగవానుడికి అత్యంత ప్రీతికరమైన పండుగ. భోగి పండుగలో రేగి పళ్లు కూడా అంతటి ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగి పండ్లను నాణేలతో కలిపి పిల్లల తలపై పోస్తుండటం ఆనవాయితీ. భోగి పండుగ రోజున సూర్య భగవానుడి అనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యంగా ఉండాలని ఈవిధంగా చిన్నారులపై భోగి పండ్లు పోస్తుంటారు. ఉత్తరాయణ సూర్యుడు మరింత వేడితో రాబోతున్నాడని తెలిపేందుకే తెల్లవారుజామునే ఇంటి ఆవరణలు, ప్రధాన కూడళ్లలో వేసే భోగి మంటలు వేయడం సంప్రదాయంగా వస్తోంది.

కిలో రూ. 350కి పైమాటే..

భోగి పండుగకు అత్యంత ప్రాముఖ్యత కలిగిన రేగిపండ్ల ధరలు వినియోగదారులను బెంబేలెత్తిస్తున్నాయి. ఒకప్పుడు పంట పొలాల గట్ల వెంబడి, ఖాళీ ప్రదేశాలలో విరివిగా లభించే రేగిపండ్లు ధర నేడు కిలో రూ.350లకు పైగా పలుకుతుండటం గమనార్హం. చిన్నారులకు భోగిపండ్లు పోయాలనే ఆశతో రేగిపండ్లు కొనుగోలు చేద్దామని బయటకు వచ్చిన తల్లిదండ్రులకు ధరలు మాత్రం పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. పిల్లల సరదాతోపాటు పండుగ సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ధర అధికంగా ఉన్నా తప్పని పరిస్థితిలో రేగిపండ్లను కొనుగోలు చేయక తప్పలేదని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

కోడిపందేలకు సై

- గ్రామాల్లో ముస్తాబైన కోడిపందేల బరులు..
- కోడిపందేల ముసుగులో పేకాట, గుండాల
- జరగనీయమంటున్న పోలీసులు



పెనుగంచిప్రోలులోని మునేటి సమీపంలోని మామిడి తోటల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి



వత్సవాయిలో మామిడి తోటలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరి

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగ నేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలో కోడిపందేల బరులను సిద్ధమయ్యాయి. కోడి పందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు జారీచేస్తున్న హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తూ కోడిపందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాల ముసుగులో కోడిపందేలు నిర్వహించి, జనం జేబులకు చిల్లుపెట్టేందుకు నిర్వాహకులు పన్నాగాలు చేస్తున్నారు. కోడిపందేల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తాయని ఆసక్తిగా ఎదురుచూస్తున్న నిర్వాహకులు, ఆమేరకు బరుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసుకుంటున్నారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకు కోడిపందేలను జరగనిచ్చేది లేదని పోలీసులు చెబుతున్న నేపథ్యంలో చివరికి ఈ వ్యవహారంలో 'ఖాకీ' గెలుస్తుందో.. కోడి గెలుస్తుందో అన్నట్లు పరిస్థితి మారింది.

ముమ్మరంగా బరుల ఏర్పాటు..

పోలీసుశాఖ ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతోపాటు పేట మున్సిపాలిటీ పరిధిలో కోడి పందేలు నిర్వహించేందుకు అధికార కూటమి నేతల అండదండలతో వారి అనుచరులు 12 బరులు ఏర్పాటు చేయడం గమనార్హం. షేర్‌మహ్మద్‌పేట, తొర్రకుంటపాలెం, అనుమంచిపల్లి, తిరుమలగిరి, బూదవాడ, పెనుగంచిప్రోలు, నవాబుపేట, వత్సవాయి, లింగాల, మంగొల్లు, జగ్గయ్యపేట పట్టణంలోని సాయినగర్, శాంతినగర్‌లలో కోడిపందేల బరులు ఏర్పాటు పనులు తదిదశకు చేరాయి. ఆయా ప్రాంతాల్లోని మామిడి తోటలు, ఖాళీ స్థలాల్లో పందేల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయడంతోపాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా పందెం కోళ్లను తీసుకురావడం గమనార్హం. పందేల సందర్భంగా కోళ్లకు కట్టే కత్తులు, ఆవరణలో ఏర్పాటు చేసే గుండాట తదితరాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అంతే కాకుండా బరుల వద్ద పేకాట, క్యాసినోలతోపాటు మద్యం, బిర్యానీ సెంటరులు ఏర్పాటు చేసేందుకు స్టాల్స్ నిర్వాహకుల నుంచి కూడా నిర్వాహకులు భారీ మొత్తంలో నగదును వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణం ఏర్పాటుకు రోజుకు రూ.15 వేలు, బిర్యానీ స్టాల్‌కు రూ. 10వేల చొప్పున వసూలు చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.



తొర్రకుంటపాలెం ఖాళీస్థలంలో ఏర్పాటు చేసిన బరిని ధ్వంసం చేస్తున్న ఏసీపీ తిలక్, సిబ్బంది

తొర్రకుంటపాలెంలో ఏర్పాటు చేసిన బరులను నందిగామ ఏసీపీ తిలక్, ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ తమ సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. పందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరిస్తున్నప్పటికీ కూటమి నేతల అధికారం ముందు ఆ హెచ్చరికలేవి పనిచేయడం లేదనే గుసగుసలు రాజకీయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. మరికొద్ది గంటల్లో కోడిపందేలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయా బరుల్లో కోడిపందేలు సాగకుండా పోలీసులు అడ్డుకుంటారో? లేక అధికార కూటమి నేతల కనుసైగలకు మిన్నకుండిపోతారోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

గ్యాంబ్లింగ్, క్యాసినో నిర్వహణకు ఏర్పాట్లు

కంచికచర్ల: సంక్రాంతి పండుగ పేరుతో భారీ ఎత్తున కోడిపందేలు, పేకాట, గ్యాంబ్లింగ్, క్యాసినో నిర్వహణకు పలువురు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో కూటమి నేతలు కంచికచర్ల మండలం పరిటాల, గండేపల్లిలో పేకాట, కోడి పందేలు, క్యాసినో వంటివి నిర్వహించేందుకు బరులు సిద్ధం చేయగా, అడ్డుకోవాల్సిన పోలీసు అధికారులే నిర్వాహకులకు వత్తాసు పలుకుతూ ఏర్పాట్లకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చందర్లపాడు మండలంలోని చందర్లపాడు, నందిగామ మండలంలోని నందిగామ మున్నేటి ఒడ్డున, ఐతవరం సమీపంలోని మామిడి తోటల్లో కోడి పందేలు నిర్వహించేందుకు బరులు సిద్ధం చేయగా, ఒక్కో బరికి రూ. 5లక్షల నుంచి రూ.20లక్షల వరకు పందేలు సాగేలా నిర్వాహకులు ప్రణాళికలు వేస్తున్నట్లు తెలిసింది. కీసర, గండేపల్లి గ్రామాల్లోని మామిడి తోటల్లో క్యాసినో నిర్వహణకు ఇప్పటికే నేపాల్, హైదరాబాద్ నుంచి కొంతమంది అమ్మాయిలను రప్పించినట్లు సమాచారం. క్యాసినో, కోడిపందేల నిర్వహణపై ఉన్నతాధికారుల నుంచి అక్షింతలు పడకుండా, ప్రభుత్వానికి సైతం చెడ్డపేరు రాకుండా ఉండేలా ఆయా బరుల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లుగా కలరింగ్ ఇస్తూ తమకు ఫొటోలు పంపిస్తే ఎవరికీ ఇబ్బందిలేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టుకోవచ్చని పోలీసులే స్వయంగా నిర్వాహకులకు సలహాలు ఇస్తున్నారనే విమర్శలు కంచికచర్ల మండలంలో వినిపిస్తుండటం గమనార్హం.



గండేపల్లి మామిడితోటలో క్యాసినో నిర్వహణకు వేసిన టెంట్లు

'భోగి' శుభాకాంక్షలు

నందిగామటౌన్/జగ్గయ్యపేటఅర్బన్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు భోగిపండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ భోగిపండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అన్నదాతలు పాడి పంటలు, సిరిసంపదలతో తలతూగాలని వారు ఆకాంక్షించారు.

పేట స్విమ్మర్లకు పతకాల పంట



జగ్గయ్యపేట అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో శనివారం నిర్వహించిన ఈతల పోటీలో జగ్గయ్యపేట స్విమ్మర్లు విజయదుందుభి మోగించారు. జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ తరఫున పోటీలకు హాజరైన సిమ్మర్లు పలు విభాగాల్లో ప్రతిభ కనపరచి ట్రోఫీతోపాటు నగదు బహుమతులు గెలుచుకున్నారు. ఒక కిలోమీటరు ఈత పోటీల్లో 45ఏళ్ల వయస్సు పైబడిన విభాగంలో కస్తాల ఏసుమణి, పొట్టాబత్తిన లక్ష్మి, తుమ్మడపు నాగమణి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. 100 మీటర్ల నలుగురు మహిళల రిలే విభాగంలో కె.ఏసుమణి, పి.లక్ష్మి, ఎ.సీతారావమ్మ, టి.నాగమణి మొదటిస్థానంలో నిలిచి సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీతోపాటు రూ.6వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. 100 మీటర్ల ఈతల పోటీ మహిళా విభాగంలో కస్తాల ఏసుమణి ఏనుగుల సీతారావమ్మ, పొట్టాబత్తిన లక్ష్మి విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో అడ్డగొట్టం రమేష్‌బాబు, యంత్రాతి రామారావు వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. విజేతలను కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి, టీం మేనేజర్ అన్నంనీడి కల్యాణ్ అభినందించారు .

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

రంగాపురం(వీరులపాడు): మండలంలోని రంగాపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. తొలుత విజయవాడ లీప్ హాస్పటల్ సౌజన్యంతో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షల నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ దామర్ల శ్రీశాంతి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతిఒక్కరి జీవితాలలో ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. రంగాపురం గ్రామాన్ని విజయవాడ లయన్స్ క్లబ్ దత్తత తీసుకుని అవసరమైన మౌలికవసతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమావత్ కోటి, వైద్యుడు మనోజ్‌కుమార్, క్లబ్ సభ్యులు పర్వతనేని సుభాష్‌బాబు, ఆంజనేయులు, చంద్రశేఖర్, చక్రధర్‌రావు, ఎర్రంరెడ్డి గాంధీ, రమావత్ రాము, గ్రామస్తులు, పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ 2000-01 బ్యాచ్ విద్యార్థులు

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి(2000–01)చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలో నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. పాఠశాల రోజులను జ్ఞప్తికి తెచ్చుకోవడంతోపాటు గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను మననం చేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏమి చేస్తున్నారో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెనుగంచిప్రోలులోని తంబరేణి గార్డెన్స్‌లో వారంతా కలిసి యోగక్షేమాలు తెలుసుకుని సామూహిక భోజనాలు చేశారు. ఇలా కలవడం చాలా ఆనందంగా ఉందంటూ సంతోషం వ్యక్తంచేశారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

కంచికచర్ల విజ్ఞాన్ స్కూల్‌లో..

కంచికచర్ల: స్థానిక విజ్ఞాన్ స్కూల్‌లో 2005–06లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. వివిధరంగాల్లో స్థిరపడిన నాటి విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకుని ఆనందోత్సవాలతో గడిపారు. అలనాటి మధురమైన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సత్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండి లావణ్య, వేమా దుర్గాప్రసాద్, పుప్పాల అయ్యప్ప, చింతల రామకృష్ణ పాల్గొన్నారు .



ఆత్మీయ సమ్మేళనలంలో కలుసుకున్న విజ్ఞాన్ స్కూల్ పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

వత్సవాయి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. లింగాల మునేటి ఒడ్డున మామిడి తోటల్లో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీకి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. తమ ముగ్గుల ద్వారా సందేశాలిచ్చారు. సంక్రాంతి పండుగ విశిష్టత, చదువు గొప్పతనం తెలియజేస్తూ ముగ్గులు వేశారు. స్త్రీలపై సమాజంలో జరుగుతున్న దాడుల గురించి వివరిస్తూ ముగ్గులను తీర్చిదిద్దారు.

కోడిపందేలకు రెడీ...

వత్సవాయి మండలంలోని ఆయా ప్రాంతాల్లో కోడి పందేలను నిర్వహించేందుకు పందెంరాయుళ్లు బరులను సిద్ధం చేశారు. లింగాల, వత్సవాయి, మంగొల్లు గ్రామాల్లో బరులను ఏర్పాటు చేశారు. వత్సవాయి మండలం రాష్ట్ర సరిహద్దు కావడంతో తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి ఎక్కువమంది పందేలకు వస్తుంటారు. కొంతమంది ఇప్పటికే నిర్వాహకుల వద్ద నుంచి బరులను కొనుగోలు చేసి పందేల నిర్వహణకు సై అంటున్నారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద



కంచికచర్లలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, పాఠకులు



పేటలో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



పేటలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిప్రదాత, దేశ ప్రతిష్టను విశ్వవ్యాపితం చేసిన చైతన్యమూర్తి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలను నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి నేతలతో కలిసి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం తన్నీరు మాట్లాడుతూ బలమైన భారతదేశ నిర్మాణం యువతతోనే సాధ్యమని స్వామివివేకానంద పేర్కొన్నారన్నారు. స్వామి వివేకానందుని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వామివివేకానందకు నివాళులర్పించిన వారిలో ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మాజీ పట్టణ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, న్యాయవాది సత్యశ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ నాయకుడు లాహోది బద్దునాయక్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శామ్యూల్ కన్నమాల, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగలి నర్సింహరెడ్డి, మన్నె అప్పారావు, మహిళా నాయకురాలు ఈశ్వరి, నాయకులు గోగుల వెంకయ్య, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే తాతయ్య నివాళులు...

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ స్వామి వివేకానంద అతి చిన్నవయస్సులోనే పార్లమెంట్ ఆఫ్ వరల్డ్ రీజియన్స్‌లో ప్రసంగించి మనదేశ సంస్కృతిని, తత్వాన్ని ప్రపంచానికి చాటిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేయాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు శ్రీరాం చినబాబు, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, ఏలూరి గోపాలరావు, కూటమి నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వివేకానంద విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయభాను మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక విశిష్టతను, హిందూ ధర్మ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దార్శనికుడు స్వామి వివేకానంద అని కొనియాడారు.

వడ్డె ఓబన్న కమిటీ ఆధ్వర్యంలో...

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న కమిటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న వివేకానంద విగ్రహానికి కమిటీ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కమిటీ సభ్యులు గుంజ నర్సయ్య, వేముల మల్లేశ్వరరావు, గుంజా హుస్సేన్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, గుంజ కొండ, బత్తుల వెంకటేశ్వరరావు, తన్నీరు మణి ఉన్నారు.



పేటలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డె ఓబన్న కమిటీ సభ్యులు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి వివేకానందుడి చిత్రపటానికి గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సంక్రాంతి రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి రద్దీ ఆదివారం నుంచే మొదలైంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు చెన్నై, బెంగుళూరు వంటి మహానగరాల నుంచి సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు బయలుదేరిన వారు ఇంద్రకీలాద్రికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే భక్తుల రద్దీతో అమ్మవారి ఆలయంలోని క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. ఉదయం 8 గంటలకు అన్ని క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు. మహామండపం లిఫ్ట్, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ క్యూల ద్వారా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అర్ధగంట అన్ని దర్శనాలు నిలిపివేయడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎక్కడా కూడా వేచి ఉండకుండా, తోపులాటకు ఆస్కారం లేకుండా క్యూలైన్లలో ముందుకు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలు వీరే



జగ్గయ్యపేట అర్బన్: సంక్రాంతి సందర్భంగా ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి.నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతి ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం మూడు విభాగాలుగా నిర్వహించిన పదిరోజులుగా నిర్వహిస్తున్న కామినేని సంక్రాంతి కప్ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలుగా సీనియర్స్ విభాగంలో హనుమంతరావు కార్తికేయ టీం, జూనియర్స్ విభాగంలో నాగేశ్వరరావు సాగర్ టీం, సూపర్ సీనియర్స్‌లో భూపతి హరికనకదర్ టీం విజేతలుగా నిలిచాయి. విజేతలకు డిప్యూటీ తహసీల్దార్ నీలం నాగరాజు, ఆర్టీసీ బీవీ రావు, రిక్రియేషన్స్ వ్యవస్థాపకులు ఆరేపల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జి.లక్ష్మినారాయణ, కామినేని రమేష్‌బాబు బహుమతులను అందజేసి అభినందించారు .